సాక్షి పల్నాడు

బుధవారం। 5। ఫిబ్రవరి। 2025



అప్పలస్వామి గుడిలో అరుణహోమం


తెనాలి:తెనాలి మారిస్‌పేటలోని కోదండరామ స్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి) లో రథ సప్తమి సందర్భంగా మంగళవారం ప్రత్యేకంగా అరుణ హోమం నిర్వహించారు.



పురపాలక సంఘ ప్రభకు పూజలు

నరసరావుపేట:కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలించే పురపాలక సంఘ ప్రభ ఏర్పాట్లకు మున్సిపల్ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. కమిషనర్ పూజలు చేశారు.

దత్త పీఠం వార్షికోత్సవం



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామంలోని దత్తపీఠం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

వైభవంగా రథసప్తమి ఉత్సవాలు

సప్త వాహనాలపై దర్శనమిచ్చిన నరసింహస్వామి




మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి నగర పరిధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రథసప్తమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు సప్త వాహనాలపై గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై తొలుత దర్శనమిచ్చారు. అనంతరం శేష, గరుడ, హనుమంతుని వాహనాలపై భక్తులను కటాక్షించారు. భక్తులు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామివారు కల్పవృక్ష వాహనం, రాజాధిరాజ వాహనం, చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా వాహనాల కైంకర్యపరులు ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటి రెడ్డి పర్యవేక్షణలో అర్చకస్వాములు పూజలు చేశారు.

ఈ-క్రాప్ నమోదుకు 15 ఆఖరు తేదీ




సత్తెనపల్లి: జిల్లాలో అన్నదాతలు సాగుచేసే పంట వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా పండించిన పంటలు అమ్ముకోవాలన్నా .. విపత్తుల సమయంలో ఇన్‌పుట్ రాయితీ, పంటల బీమా పొందాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరి. ఈ క్రాప్ నమోదు ప్రస్తుతం జరుగుతోంది. నమోదు ప్రక్రియకు ఈ నెల 15 ఆఖరి తేదీ కావడంతో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ పంటను నమోదు చేసుకోవడానికి రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. రైతులు సాగు చేసే వ్యవసాయ భూమి విస్తీర్ణం, సర్వేనెంబర్ ఆధారాలను తీసుకెళ్తే క్షేత్రస్థాయికి వచ్చి వ్యవసాయ శాఖ పోర్టల్‌లో డిజిటల్ ఈ-క్రాప్ నమోదు చేస్తారు. జిల్లాలోని 28 మండలాల్లో 1,35,572 ఎకరాల్లో రబీ పంటల సాగు జరుగుతుంది. ఇప్పటివరకు 1,23,205 ఎకరాల్లో పంటలను రైతులు నమోదు చేసుకోగా 90.9 శాతం ఈ-క్రాప్ పూర్తయింది. 21,940 ఎకరాల్లో రైతులు ఈ-కేవైసీ కూడా పూర్తి చేశారు. ఇంకా 12,367 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు కావలసి ఉంది. జిల్లాలో అత్యధికంగా నరసరావుపేట మండలంలో 7,099 ఎకరాల రబీ సాగు గాను 7,091 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేయడంతో 99.9 శాతం పూర్తయింది. అత్యల్పంగా వినుకొండ మండలంలో 9,637 ఎకరాల్లో రబీ సాగు చేయగా 6,813 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేయడంతో 70.7 శాతం పూర్తయింది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 550.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,833 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సాగునీటి సమాచారం




తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1,818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 76 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 203 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 141 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 122 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 45 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 680 క్యూసెక్కులు వదిలారు.

ప్రజాస్వామ్యాన్ని పచ్చనేతలు అపహాస్యం చేస్తున్నారు.. వారికి ఖాకీలు వంతపాడుతున్నారు.. తమకు ఏమాత్రం గెలిచే అవకాశం లేని పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు కావాలని అడ్డు తగులుతూ పట్టణంలో బీభత్సం సృష్టిస్తున్నారు. కౌన్సిలర్లను ఇళ్లనుంచి బయటకు రానీకుండా టీడీపీ గూండాలు వారి ఇళ్లవద్ద నానా హంగామా చేస్తుంటే.. వాటిని తట్టుకుని బయటకు వచ్చిన వారిని సమయం మించిపోయేవరకు కేసుల పేరుతో పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి, కూటమికి ప్రత్యక్షంగా సహకరిస్తూ.. ఖాకీలు ప్రజాస్వామ్య వలువలు నిస్సిగ్గుగా ఊడదీస్తున్నారు.



వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఇంటి ముందు కాపలాగా నిలబడ్డ టీడీపీ మూకలు



ఖాళీగా ఉన్న కౌన్సిల్ హాల్

ఘోరాతి కోరం!

'పచ్చ' గూండాలతో పోలీసులు కుమ్మక్కు

- వలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను అదుపులోకి తీసుకున్న ఖాకీలు
- కేసులు ఉన్నాయంటూ సాకు..
- సమయానికి హాజరుకానీకుండా ఆటంకాలు
- మరోవైపు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ఇంటి ముందు కాపలాగా ఉన్న పచ్చ మూకలు
- కోరం లేక పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రెండవరోజు సైతం వాయిదా పడింది. మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 32 మంది ఉండటంతో సాధారణంగా వైఎస్సార్ సీపీనే వైస్ చైర్మన్ ఎన్నిక గెలవాల్సి ఉండగా అధికార పార్టీ ఆదేశాలతో ఒక పక్క పోలీసులు, మరో పక్క టీడీపీ గూండాలు కుమ్మక్కై మళ్లీ వాయిదా పడేలా చేశారు.

ఎక్కడికక్కడ ఆటంకాలు..

తెలుగుదేశం పార్టీ గూండాలతో కుమ్మక్కైన పోలీసులు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను మున్సిపల్ కార్యాలయం వరకు రాకుండా ఎక్కడిక్కడికి అడ్డుకున్నారు. సాధారణంగా 10 గంటల లోపు ఫాం ఏ, ఫాం బీలు మున్సిపల్ కార్యాలయంలో అందించాల్సి ఉంది. అయితే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎవరిని మున్సిపల్ కార్యాలయం వద్దకు రానివ్వకుండా కట్టడి చేయటంతో ఆ ఫారాలను సకాలంలో అందించలేకపోయారు. 32 మంది గాను కేవలం ఐదుగురు మాత్రమే మాజరయ్యారు. సుమారు ఒక 10 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను పట్టణ పోలీసులు తమపై కేసులు ఉన్నాయని చెప్పి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన కౌన్సిలర్లను వారి ఇళ్లలో నుంచి బయటకురానివ్వకుండా ఇళ్ల ముందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గూండాల్లాగా నిలబడి కాపలాగా నిల్చోన్న పరిస్థితి. దీంతో సమయానికి పత్రాలు అందించకపోవటంతో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రెండవ రోజు మంగళవారం సైతం వాయిదా పడింది.

కోరం లేనందునే వాయిదా



పిడుగురాళ్ల: కోరం లేనందువల్లే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గురజాల ఆర్డీఓ మురళీ కృష్ణ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మంగళవారం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశామని, 12 గంటల వరకు కౌన్సిలర్ల కోసం వేచి చూడటం జరిగిందని, ఐదుగురు మాత్రమే కౌన్సిల్ హాల్‌కు హాజరయ్యారన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహణకు కనీసం 50 శాతం కౌన్సిలర్లు హాజరు కావాలన్నారు. కోరం ఏర్పడకపోవటం వలన రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మంగళవారం కూడా వాయిదా వేసినట్లు తెలియజేస్తామని, మళ్లీ ఎన్నిక ఎప్పుడు అనేది ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ఉదయాన్నే భారీ సంఖ్యలో..

ఉదయాన్నే పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఒక పక్క టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మున్సిపల్ కార్యాలయం అంతా కిక్కిరిసిపోయింది. అయితే మున్సిపల్ కార్యాలయం వద్దకు మాత్రం కేవలం ఐదుగురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. 18వ వార్డు కౌన్సిలర్ జ్యోగిపర్తి సుజాత, 20 వార్డు కొత్త తులసీ, 21వ వార్డు కొత్త పుష్పలత, 28వ వార్డు గర్నె నాగేశ్వరరావు, 30 వ వార్డు ఉన్నం భారతిలు మాత్రమే హాజరయ్యారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న టీడీపీ

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: గతంలో మున్సిపల్ ఎన్నికలు, స్థానిక ఎన్నికలను తాము బహిష్కరిస్తామని ప్రగల్భాలు పలికిన టీడీపీ నాయకులు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా మున్సిపల్ ఎన్నికలలో అరాచకాలకు పాల్పడటం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్లలో వైఎస్సార్ సీపీకి పూర్తి మెజార్టీ ఉన్న మున్సిపాలిటీలో బెదిరింపులకు దిగి టీడీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. బెదిరింపులకు గురిచేసినంత మాత్రాన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు భయపడరని, వారికి అండగా పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మొత్తం ఉప ఎన్నికల నిర్వహణే అపహాస్యంగా మారిన విషయాన్ని గమనించి ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మా కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారు

- టీడీపీ గూండాలు, పోలీసులు కుమ్మక్కయ్యారు
- జిల్లా ఎస్పీ, ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: తెలుగుదేశం పార్టీ గూండాలు, పోలీసులు కలిసి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి వైస్ చైర్మన్ ఎన్నికల జరగకుండా అడ్డుకుంటున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ గూండాలు, పోలీసులు కావాలనే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని, మరికొంతమంది కౌన్సిలర్లను కావాలనే బెదిరిస్తున్నారని ఆయన తెలియజేశారు. గురజాల సీఐపై న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు. కౌన్సిలర్లను ఎక్కడ పెట్టారో తెలియకుండా చేశారని, ఎవరి ఫోన్‌లు అందుబాటులోకి లేకుండా చేశారని, 13వ వార్డు కౌన్సిలర్ ఫోన్ మాత్రమే అందుబాటులో ఉందని, ఫోన్ చేస్తే అతను మాట్లాడుతూ సీఐ కారు డ్రైవర్ కొండా వచ్చి మీ మీద కేసు ఉందని రావాలని చెప్పాడని తెలిపారన్నారు. ఘటనను ఎస్పీ దృష్టికి తీసుకొని వెళ్తామని తెలియజేశారు. ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నిక ఎప్పుడు జరిగినా గెలిచేది వైఎస్సార్ సీపీ అభ్యర్థే అని ధీమా వ్యక్తం చేశారు.



13వ వార్డు కౌన్సిలర్ కరిముల్లా వాయిస్‌ను వినిపిస్తున్న కాసు మహేష్‌రెడ్డి

రైల్వే లైన్ భూసేకరణపై విముఖత

- అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు నూతన రైల్వే లైన్
- భూసేకరణపై రైతుల అభ్యంతరాలు



అమరావతి: రాజధాని అమరావతికి రైలు మార్గం కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ ప్రతిపాదించింది. ఈక్రమంలో రైల్వే లైన్ కోసం రైల్వే అధికారులు, రాష్ట్ర రెవెన్యూ అధికారులు భూసేకరణకు శ్రీకారం చుట్టారు. రాజధాని అమరావతికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు రైల్వే లైన్ వేయాలని నిర్ణయించారు. కరిస్తామని తమకు రాజధానిలో ఇచ్చినట్లు 1250 గజాల స్థలాన్ని ఇవ్వాలని అధికారులకు రైతులు తేల్చి చెబుతున్నారు. రైల్వేలైన్ కోసం భూసేకరణ చేస్తారా లేక భూ సమీకరణ చేస్తారా, ఇందులో ఉన్న ఇనాం భూముల యజమానులకు పరిహారం అందుతుందా అనే ప్రశ్నలు రైతులను వేధిస్తున్నాయి. రైల్వే లైన్ భూసేకరణ చేసే గ్రామాలలో ఇటీవల భూమి విలువ పెంచడం నుంచి మినహాయించటం వల్ల తమకు నష్టం వస్తుందని, అలాగే పరిహారం ప్రాతిపదికన ఇస్తారనే సందేహాలు రైతులలో ఉన్నాయి.

మూడు గ్రామాల్లో 333.44 ఎకరాలు

మండలంలోని కర్లపూడి, వైకుంఠపురం, ఎండ్రాయి గ్రామాలలో 333.44ఎకరాలు భూసేకరణ చేయాలని గతేడాది నవంబర్ 23వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భూసేకరణలో వైకుంఠపురం గ్రామం నుంచి 62 సర్వే నంబర్ల నుంచి 45.53 ఎకరాలతో పాటుగా మరో 47ఎకరాలకు పైగా లంక భూములను కూడా సేకరిస్తారని సమాచారం. అలాగే ఎండ్రాయి గ్రామంలో 6 సర్వే నెంబరులలో 7.31ఎకరాలు, 62 సర్వేనెంబర్‌లలో 232.94 ఎకరాల భూమిని సేకరించటానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అమరావతిలో స్థలాలు ఇస్తేనే ..

మూడు గ్రామాల రైతులు నోటిఫికేషన్ వచ్చిన నాటినుంచి రైల్వే లైన్ భూ సేకరణకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తాము భూ సమీకరణకు సహ

సందేహాలు నివృత్తి చేశాకే..

ప్రభుత్వం మాత్రం రైతుల అభ్యంతరాలను సత్తెనపల్లి ఆర్డీఓ సమక్షంలో వినిపించి, రాతపూర్వకంగా అందచేయాలని నోటిఫికేషన్‌లో కోరింది. ఈనేపథ్యంలో రెవెన్యూ అధికారులు మూడు గ్రామాలకు చెందిన కొంతమంది రైతులను పిలిపించి మాట్లాడటంలో అర్థం ఏమిటని మిగిలిన రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, రైల్వే అధికారులు కలిసి మూడు గ్రామాల రైతులతో గ్రామసభలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేసి వారిని ఒప్పించి అనంతరం రైల్వే లైన్ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'కూటమి' కుమ్మక్కు

- నరసరావుపేటలో ఐపీ వ్యాపారి ఉదంతం రోజుకో మలుపు
- తాజాగా బాధితులను మరింత ముంచేందుకు కూటమి నేతల కమిటీ
- వ్యాపారి ఆస్తులు రెండింతలుగా చూపుతున్న వైనం
- బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా ఆపేందుకు ఎత్తుగడ
- ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించాలంటున్న బాధితులు

నరసరావుపేటటౌన్: పది రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాయిసాధన చిట్‌ఫండ్ వ్యాపారి పరారీ వ్యవహారం హాట్‌టాపిక్ గా మారింది. నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి సుమారు రూ.400 కోట్లు గోల్‌మాల్ చేసిన ఘనుడి ఉదంతం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం రోజుకొక మలుపు తిరుగుతూ డబ్బులు పెట్టుబడి పెట్టిన వారికి తీవ్ర వేదన కలిస్తోంది. అయ్యా రెక్కలు ముక్కలు చేసుకున్న కష్టమంతా ఆయనకే ఇచ్చామయ్యా అంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కన్నీటి పర్యంతమవుతుంటూ చూసిన వారి ప్రతి ఒక్కరి గుండె చలించిపోతోంది.

ఈ క్రమంలో పోలీసులైనా తమకు న్యాయం చేస్తారని ఆశగా ఎదురుచూస్తోన్న తరుణంలో కూటమి నేతలు రంగం ప్రవేశం చేసి బాధితులను మరింత ముంచేందుకు పావులు కదుపుతున్నారు.



నరసరావుపేటలోని సాయిసాధన చిట్‌ఫండ్ కార్యాలయం

ఉన్నది గోరంత .. చెప్పేది కొండంత

వ్యాపారిని కాపాడేందుకు ఏర్పాటైన కమిటీ.. ఆ వ్యాపారి వద్ద ఆస్తులు ఎంత ఉన్నాయి? అప్పులు ఎంత ఉన్నాయి. వంటి లెక్కలు రాస్తున్నారు. ఈ క్రమంతో ఆ వ్యాపారి ఆస్తులను రెండింతలు, మూడింతలు పెంచి లెక్కలు చూపుతున్నారు. ఇలా చేయడం ద్వారా అప్పులతో సమానంగా ఆస్తులు ఉన్నాయనే భ్రమ కల్పించేందుకు కుట్రలు పన్నుతున్నారు. తద్వారా ఆ వ్యాపారికి నగదు ఇచ్చి మోసపోయిన వారిని మరింత ముంచేందుకు వారి కళ్లకు భ్రమల గంతలు కడుతున్నారు. ఇలా చేయడం ద్వారా సదరు ఘనుడు ఐపీ పెట్టేందుకు మరింత సమయం దొరకడంతోపాటు బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లకుండా ఆపొచ్చనే పన్నాగంతో ఈ కమిటీ పిల్లిమొగ్గలు వేస్తున్నట్లు సమాచారం. వందల కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ ఉదంతంపై ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

జట్టు కట్టి.. బాధితులకు ఎసరు పెట్టి

నరసరావుపేటలో సాయిసాధన చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, విజయలక్ష్మీ టౌన్‌షిప్ పేరిట రియల్ ఎస్టేట్, ఆస్తులు ఎరగా చూపి సుమారు రూ.400కోట్లతో వ్యాపారి పాలడుగు పుల్లారావు పది రోజులక్రితం కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లాడు. చిట్‌ఫండ్ స్కాంపై నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా, రియల్‌ఎస్టేట్ పేరిట చేసిన మోసంపై గుంటూరు పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో మరో చీటింగ్ కేసు నమోదయ్యింది. దీంతో పాటు బాధితులు పెద్దఎత్తున సదరు వ్యాపారి కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రజల సొమ్ము కాజేసిన ఘనుడు తమ పార్టీ, సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కూటమి పార్టీ నేతలు రంగ ప్రవేశం చేశారు. ఈ విషయం మరింత పెద్దదైతే ఇబ్బందులు వస్తాయని గ్రహించి, వారే మధ్యవర్తిత్వానికి సిద్ధమయ్యారు. దీని కోసం కూటమి నేతల్లో ఐదుగురు ఒక కమిటీగా ఏర్పడ్డారు. ఈ కమిటీ ద్వారా ప్రజల సొమ్ము కాజేసిన ఘనుడిని కాపాడుతూ, పెట్టుబడి పెట్టిన వారిని మరింత ఎలా ముంచాలో ప్రణాళికలు గీస్తున్నారు.

కన్నకూతురిపై తల్లి కర్కశం

- ఏడు నెలలుగా చిత్రహింసలు
- భర్త, కుమారుడిని వదిలి కుమార్తెతో సత్తెనపల్లికి..
- తల్లీకూతుళ్ల అదృశ్యంపై గుంటూరు లాలాపేట స్టేషన్‌లో కేసు
- ఆధార్ అప్‌డేట్‌తో ఆచూకీ వెలుగులోకి..
- ఆశ్రయం ఇచ్చిన బాషా, శివపార్వతి పాత్రపై అనుమానాలు..?

సత్తెనపల్లి: భర్తను, కుమారుడిని విడిచిదూరంగా వచ్చి కన్న కూతురినే ఏడునెలలపాటు చిత్రహింసలకు గురిచేసిన ఓ తల్లి ఉదంతం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు రామ్‌రహీమ్‌కాలనీ చాకలిగుంటకు చెందిన షేక్ సమీర్‌కు విశాఖకు చెందిన దరియాబీకి 2016లో పెళ్లయింది. వీరికి కుమారుడు నిస్సార్, కుమార్తె షహనాజ్ ఉన్నారు. సమీర్ కార్పెంటర్. గత ఏడాది జూలైలో భర్తకు చెప్పాపెట్టకుండా కుమార్తెతో పాటు ఇంట్లోని రూ. 6.50 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు, రూ.32 వేలు నగదుతో దరియాబీ బయటకు వెళ్లిపోయింది. దీంతో సమీర్ లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భార్య, కుమార్తె అదృశ్యం కావడానికి ఇంటి పక్కనే నివాసం ఉండే బాషా, శివపార్వతి అలియాస్ షహీనా కారణమంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసినా దరియాబీ ఆచూకీ దొరకలేదు.

పట్టిచ్చిన ఆధార్ అప్‌డేషన్ యత్నం

జనవరి 8న దరియాబీ తన ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకునేందుకు రెండుసార్లు ప్రయత్నించగా భర్త సమీర్ సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చింది. వెంటనే అతను పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆమె సత్తెనపల్లిలో ఉంటూ కూతురికి నరకం చూపిస్తున్నట్టు తెలుసుకున్న పోలీసులు సత్తెనపల్లి వచ్చి విచారణ చేపట్టారు. పోలీసుల సమాచారంతో సమీర్ సత్తెనపల్లి చేరుకున్నాడు.



దరియా బీని సబ్‌జైలుకు తరలిస్తున్న మహిళా పోలీసు

పోలీసులకు అబద్ధాలు

విచారణలో దరియాబీ పోలీసులకు అన్నీ అబద్ధాలే చెప్పింది. తన పేరు మాధవి అని, భర్త నాలుగేళ్ల క్రితం చనిపోయాడని వెల్లడించింది. కాగా, తల్లి, కుమార్తె అదృశ్యానికి, తనకు ఎలాంటి సంబంధం లేదని లాలాపేట పోలీసులకు చెప్పిన శివపార్వతి వారిద్దరికీ ఆశ్రయం ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. కుమార్తెను చిత్రహింసలు పెట్టిన కేసులో దరియాబీని సత్తెనపల్లి పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచారు.

బాషా, శివ పార్వతి పాత్రపై అనుమానాలు..?

దరియాబీ ఇంటి నుంచి వచ్చి దూరంగా జీవించడం, సొంత కూతురినే చిత్రహింసలు గురిచేయడం వెనుక బాషా, శివపార్వతి పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లీకూతుళ్లకు ఆశ్రయం ఇవ్వడమే కాక విచారణకు వెళ్లిన పోలీసులపై కుక్కలను ఉసిగొల్పాల్సిన అవసరం ఏంటని ఆరా తీస్తున్నారు. దీని పై సమీర్ మాట్లాడుతూ బాషా, శివపార్వతిని విచా రణ చేస్తే అన్నివిషయాలు తెలుస్తాయని చెబుతున్నాడు.

నగలు, నగదు ఎక్కడ?

దరియాబీ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు రూ.6.50 లక్షల ఆభరణాలు, రూ.32 వేలు నగదు తీసుకు వెళ్లిదని అవి ఏమయ్యాయో తేలాల్సి ఉందని భర్త చెబుతున్నారు. దరియాబీ చేత పాచిపనులు చేయిస్తున్నట్టు తెలిసిందని, ఆమె ఇంటి నుంచి వెళ్లినప్పటికి, ఇప్పటికి చాలా తేడా ఉందని, మతిస్థిమితం లేని వ్యక్తిలా మారిందని, డ్రగ్స్ వాడారేమోనని అనుమానం ఉందని పేర్కొన్నారు. తన భార్యకు వివాహేతర సంబంధం లేదని, తల్లితోపాటు బాషా, శివపార్వతి కూడా బెల్ట్‌తో కొట్టేవారని తన కుమార్తె చెబుతోందని వివరించారు. పోలీసులు పూర్తి దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరాడు. తన కుమార్తెను గుంటూరు జీజీహెచ్ నుంచి మంగళవారం డిశ్చార్జి చేస్తారని సమీర్ చెప్పాడు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు



గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ ఘంటాలమ్మ, శ్రీ పుట్టలతమ్మ ఆలయ హుండీ కానుకలను మంగళవారం ఆలయ ఈఓ డి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.2.57 లక్షలు వచ్చిందని ఈఓ తెలిపారు. ఆలయ అర్చకుడు రాంబాబు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సూరిశెట్టి హర్ష, పి. నాగభూషణం, శిరసాని వెంకటరావు పాల్గొన్నారు.

కేంద్రం పైసా విదల్చకున్నా జేజేలు కొట్టడం విడ్డూరం

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల వైఖరితో రాష్ట్రానికి తీవ్ర నష్టం
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: కేంద్రంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సాధించిందేమీ లేదని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుందని ఎదురుచూస్తున్న సమయంలో కేంద్రం పోలవరం డిజైన్‌తో పాటు అన్నిప్రాంతాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. మొత్తం మా హవానే ఉంటుందని సీఎం చంద్రబాబు చెప్పినా ఆంధ్రప్రదేశ్ గురించి కేంద్ర బడ్జెట్‌లో పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పోలవరంతో పాటు అన్నీ విషయాల్లో రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. గతంలో అనేకసార్లు పోలవరంకు సంబంధించి కేంద్రం వివిధ రకాలుగా నిధులు కేటాయిస్తామని చెప్పినా, ఎత్తు తగ్గిస్తామని చెప్పినా మాజీ సీఎం జగన్ ఒప్పుకోలేదన్నారు. ఇప్పుడు పోలవరం ఎత్తు తగ్గిస్తున్నా చంద్రబాబు చూస్తుండిపోయారన్నారు. రాష్ట్రంలో 15 మెడికల్ కాలేజీలలో సీట్లు పెంచుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం చేజేతులా పోగొట్టుకుందన్నారు. బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రానికి మేలు చేయకపోయినా సీఎం చంద్రబాబు, ఎంపీలు ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి జేజేలు పలికి రాష్ట్రానికి ఎనలేని మేలు జరిగినట్లు డప్పు కొడుతుండడం హాస్యాస్పదమన్నారు.

రాష్ట్రానికి తీవ్రనష్టం జరుగుతున్నా మాట్లాడలేని స్థితిలో సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఉన్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే కేంద్రంతో చర్చించి రాష్ట్రానికి మేలు చేసేలా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. లేదంటే మాజీ సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

పకడ్బందీగా ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు

జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి నీలావతిదేవి


సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఇంటర్మీడియెట్ అధికారులు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణలో భాగంగా ఈనెల 5వతేదీ నుంచి 20 వరకు జరగనున్న ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పల్నాడుజిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి, పరీక్షల స్పెషల్ ఆఫీసర్ కె.వేణు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని సూచించారు. జిల్లాలో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో 1,874మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారన్నారు. వీరిలో 1,094మంది ప్రథమ, 780 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఆయా కేంద్రాలకు 14 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సబ్జెక్ట్ ఎగ్జామినర్లను నియమించామన్నారు. ప్రాక్టికల్ పరీక్ష ఆదివారంతో సహా ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్ష సమయానికి 30 నిమిషాలు ముందుగా సీఎస్‌లకు ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రం అందుతుందని, దానిని ఎగ్జామినర్లకు అందజేసి సరైన సమయానికి పరీక్షను ప్రారంభించాలని తెలిపారు. విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్ష మెటీరియల్ అందచేసే సిబ్బంది సదరు మెటీరియల్‌ను అందచేసి వెంటనే పరీక్షా హాల్ నుంచి వెళ్లిపోవాలని తెలిపారు. పరీక్ష పూర్తయిన తరువాత కళాశాల నుంచే ఆన్‌లైన్‌లో మార్కులను అప్‌లోడ్ చేయాలని వివరించారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు


ఆరుపళ్ల విభాగంలో మొదటి బహుమతి సాధించిన వేటపాలెం ఎడ్లజత

నాదెండ్ల: నాదెండ్ల-గణపవరం డొంక రోడ్డులో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వీక్షకుల కేరింతలు, ఎడ్ల బలప్రదర్శనతో దుమ్మురేపాయి. మంగళవారం ఆరు పళ్ల విభాగంలో 11 జతలు పాల్గొన్నాయి. సోమవారం రాత్రి వరకు నాలుగు పళ్ల విభాగంలో 7 జతలకు పోటీలు జరిగాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి న్యూ కేటగిరి విభాగంలో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కేటగిరీలో 13 జతల ఎడ్లు పాల్గొన్నాయి. బుధవారం సబ్‌జూనియర్స్ విభాగంలో జరగనున్నాయి.

నాలుగు పళ్ల విభాగంలో చిలకలూరిపేట జతకు ప్రథమ బహుమతి..

నాలుగు పళ్ల విభాగంలో ఏడు జతలు పాల్గొన్నాయి. చిలకలూరిపేట పట్టణం పురుషోత్తమపట్నంకు చెందిన షేక్ అబ్దుల్‌సత్తార్, అమీర్‌బాబు ఎడ్ల జత 3962 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం కైవసం చేసుకుంది. రెండో బహుమతిని బాపట్ల జిల్లా జె.పంగులూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్ జత 3923 అడుగుల దూరం లాగాయి. మూడో బహుమతిని కృష్ణాజిల్లా పెనుమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు జత 3576 దూరం లాగి గెలుపొందాయి.

ఆరు పళ్ల విభాగంలో..

ఆరుపళ్ల విభాగంలో 11 జతలు పాల్గొనగా, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4 వేల అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య శ్రీ మధు జత 3621 అడుగుల దూరంతో రెండో స్థానాన్ని, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్‌ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మయ్యచౌదరి, రాయుడు సుబ్బారావు జత 3399 అడుగుల దూరంతో మూడో స్థానాన్ని సాధించాయి. ఎడ్ల జతల యజమానులకు కమిటీ సభ్యులకు షీల్డ్, నగదును అందించారు.

గొర్రెల మండిపై కుక్కల దాడి

15 గొర్రెలు మృత్యువాత


మృత్యువాత పడిన జీవాలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి డి.వెంకటశివాజీ

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని దాట్లవారిపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గొర్రెల మండిపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 15 గొర్రెలు మృత్యువాత పడగా 10 గొర్రెలకు గాయాలయ్యాయి. రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు మోరబోయిన వీరయ్య తెలిపారు. తన తండ్రి అప్పు చేసి 30 జీవాల పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నారని, ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు.

ఆటోబోల్తా.. విద్యార్థులకు గాయాలు


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న అనన్య

అచ్చంపేట: విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా కొట్టగా నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని తాడువాయి - కొత్తపల్లి గ్రామాలమధ్య మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాడువాయి నుంచి తాళ్లచెరువులోని ఓ పాఠశాలకు నిత్యం ఎనిమిది మంది విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. రోజూలాగే ఆటోలో మంగళవారం ఉదయం తాడువాయిలో ఎనిమిది మందిని ఎక్కించుకుని తాళ్లచెరువు వస్తుండగా గ్రామానికి సమీపంలో పంటపొలాలవద్దగల మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది. ఆటో రెండు పొర్లుగింతలు వేసి పంట పొలాలలో పడింది. అందులో ప్రయాణిస్తున్న మూడో తరగతి విద్యార్థిని అనన్య ఎడమ చేతికి తీవ్రగాయమైంది. మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. గౌతమ్, దీపిక, అక్కి, మిల్కి, హనీ, దీవెనలకు స్వల్ప గాయాలయ్యాయి. మలుపులో ఎదురుగా వస్తున్న వాహన కనిపించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

ఆహ్వాన నాటికల పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరించిన వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు

యడ్లపాడు: నాటికల పోటీల నిర్వహణలో కొత్త ఒరవడిని సృష్టించేందుకు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళన వేదిక కృషి చేస్తుందని వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 4,5,6 తేదీల్లో జరిగే జాతీయస్థాయి ఆహ్వాననాటికల పోటీల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిషత్‌ల నిర్వహణలో ప్రేక్షకులకు వినూత్న తరహాలో వినోదం అందించేందుకు వేదిక ప్రయత్నిస్తుందన్నారు. మూడు రోజులు జరిగే పోటీలకు 9 నాటికలతో పాటు చివరిరోజు స్థానిక కళాకారుల్ని ప్రోత్సహిస్తూ ప్రత్యేక నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య స్మారక నాటకోత్సవాల కమిటీగా ఉన్న పేరును ఈ ఏడాది నుంచి పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయంగా మార్పు చేస్తున్నట్లు చెప్పారు. పోటీలకు వచ్చే ప్రతి నాటికకు రూ.18వేలు పారితోషికం, రచయిత, దర్శకులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున టీమ్‌కు రూ.20వేల నగదు, షీల్డ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉత్తమ నటన వ్యక్తిగత అవార్డు కింద రూ.వెయ్యి, షీల్డ్ చొప్పున ఐదుగురికి నగదు, అలాగే ఆడపడుచు సత్కారం కింద మహిళా కళాకారిణులకు నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులతో చదివింపు, పరిషత్ నిర్వహణకు సహకరిస్తున్న దాతలను ప్రత్యేకించి అభినందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం నిర్వాహకులు ముత్తవరపు రామారావు, నూతలపాటి మాధవరావు, జరుగుల శంకరరావు, పోపూరి నాగేశ్వరరావు, షేక్ బాజీ తదితరులు ఉన్నారు.

అసంఘటిత కార్మికుల వివరాలు నమోదు చేయాలి

నరసరావుపేట రూరల్: అసంఘటిత రంగ కార్మికుల వివరాలను ఈ శ్రమ పోర్టల్‌ను నమోదు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంచాలకులు బాలునాయక్ తెలిపారు. కోటప్పకొండ సంస్థ జిల్లా కార్యాలయంలో మంగళవారం కార్మికశాఖ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశ్యంతో ఈ-శ్రమ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇప్పటికే సర్వే ద్వారా జిల్లాలోని కార్మికులను గుర్తించినట్టు తెలిపారు. 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని తోపుడు బండ్లు, వలస కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి ధనలక్ష్మి, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే సత్ఫలితాలు వస్తాయని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్‌లో మంగళవారం మిడిల్, సెకండరీ క్యాంపస్‌ల 50వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యను ఒక మూస పద్ధతిలో కాకుండా తల్లిదండ్రులు, పిల్లల అభిరుచికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మనం దేశాన్ని, పెద్దలను, గురువులను, తల్లిదండ్రులను తప్పక గౌరవించాలన్నారు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాఠశాల సీఏవో దుర్గా రఘురామ్ మాట్లాడుతూ.. శాంతి, ఆరోగ్యం, సహాయ సహకారాలకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొబైల్ ఫోన్‌ను అత్యవసరాలకే పరిమితం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ సుధామాధవి, వైస్ ప్రిన్సిపల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే సిబ్బందికి పలు పోటీలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం ఎం. రామకృష్ణ, సీనియర్ డీఈఈ పి.రవితేజ

లక్ష్మీపురం: భారతీయ రైల్వే వంద సంవత్సరాల ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌ను పూర్తి చేసుకుందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన భారతీయ రైల్వేలు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. సీనియర్ డీఈఈ పి.రవితేజ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారన్నారు. ప్రధానంగా నల్లపాడు కేంద్రీయ విద్యాలయంలోని క్విజ్, వ్యాసరచన పోటీలు జరిగాయని చెప్పారు. సాంకేతిక సెమినార్ బ్రోచర్, ప్రదర్శన, విద్యుత్ ట్రాక్షన్ చరిత్ర, వాకథాన్ ఉత్సాహంగా కొనసాగిందన్నారు.అనంతరం బ్రోచర్‌ను డీఆర్‌ఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ విద్యుదీకరణ విభాగాధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చోరీలు చేస్తున్న ముఠా అరెస్ట్

రూ. 2 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీని లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ మంగళవారం తెలిపారు. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ళ గ్రామానికి చెందిన కొడవలి సుజాత గత నెల 30వ తేదీన గుంటూరు వెళ్లేందుకు స్వగ్రామం నుంచి ఆర్టీసీ బస్సులో నరసరావుపేటకు వచ్చింది. బస్టాండ్‌లో బస్సు మారి గుంటూరు బస్సు ఎక్కి హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా అది కత్తిరించబడి ఉంది. అందులో ఉండాల్సిన సుమారు రూ.2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం కె.చిట్టెమ్మ, కె.విజయ్‌కుమార్, ఆర్.బాలయ్యతో పాటు మరో ఇద్దరు మైనర్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

గౌడ వర్గీయుడిని దూషించిన టీడీపీ నేత

- మద్యం షాపు వ్యవహారంలో దూషించిన టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి
- రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిన పాలువాయి మద్యం షాపు
- రాష్ట్ర గౌడ సంఘ నాయకులతోనూ శ్రీనివాసరెడ్డి వాగ్వివాదం
- సామాజిక మాధ్యమాల్లో వైరలైన కాల్ రికార్డింగ్స్

నర్సరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గౌడ కులానికి మద్యం షాపులు కేటాయించగా రెంటచింతల మండలం పాలువాయి గ్రామానికి చెందిన బ్రహ్మం గౌడ్‌ను శ్రీనివాసరెడ్డి అనే తెలుగుదేశం పార్టీకి చెందిన మద్యం వ్యాపారి ఫోన్‌చేసి మద్యంషాపునకు టెండర్ వేయవద్దని బూతులు తిడుతూ బెదిరించిన విషయం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి కూడా చెప్పా నిన్ను తంతా నా కొ... ఇక్కడ కురా దమ్ముంటే అంటూ బ్రహ్మంగౌడ్‌ను బెదిరించగా బ్రహ్మంగౌడ్ ఆ కాల్ మొత్తం రికార్డు చేసి వివిధ గ్రూపులలో పోస్ట్ చేశాడు. ఈ విషయం పలు సామాజిక మాధ్యమాలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ సంఘ నాయకుల దృష్టికి వెళ్లింది. - దీనిపై రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వేమా మురళి, కడప నుంచి సిద్ధార్థ గౌడ్ అనే నాయకులు శ్రీనివాసరెడ్డికి ఫోన్‌చేసిన విషయం సైతం రికార్డై పలు గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.. సిద్ధార్థ గౌడ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కులవృత్తి చేసుకుంటూ కల్లు అమ్ముకునే గౌడ కులస్తులకు 10 శాతం రిజర్వేషన్ ఇస్తే మీరు ఎందుకు బ్రహ్మం గౌడ్‌ను బెదిరించారు. షాపు దగ్గరకు రా నిన్ను తంతా అంటూ బెదిరిస్తావా ఎం నాటకాలు వేస్తున్నావా...పార్టీ అధికారంలో రావడానికి మీ ఎమ్మెల్యేను గెలిపించడానికి బీసీ కులస్తులు ఎంత కష్టపడ్డారో తెలుసా అంటూ మండిపడ్డారు. మేము టీడీపీకి ఓటు వేయలేదా.. మీ ఎమ్మెల్యే గెలిపించలేదా అంటూ గౌడ నాయకులు మండిపడ్డారు. గౌడ కులస్తులకు కేటాయించి మద్యం షాపుల్లో నీ పెత్తనం ఏంటి? నీ సంగతి సీఎం చంద్రబాబు దగ్గర పెడతామన్నారు. ఈ ఫోన్ రికార్డులు మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా పలు సామాజిక మాధ్యమాలలో వైరలై రాష్ట్రంలో పాలువాయి మద్యం షాపు హాట్ టాపిక్‌గా మారింది. దీంతో పాలువాయి మద్యంషాపు విషయమై టీడీపీలోని బీసీ వర్గాలు, ముఖ్యంగా గౌడ సామాజికవర్గం భగ్గుమంటోంది. ఈ ముసలం ఎటు దారితీస్తుందోనని టీడీపీ అగ్రనాయకులు తలలు పట్టుకుంటున్నారు.

విజ్ఞాన్ విద్యార్థినికి బంగారు పతకం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థిని తైక్వాండోలో జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తమ యూనివర్సిటీలో రెండో సంవత్సరం సీఎస్‌ఈ చదువుతున్న ఆర్.కళా జ్యోత్స్న ఇటీవల తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ఈ పతకం సాధించిందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున అండర్ -67 కేజీల సీనియర్ ఉమెన్ కేటగిరీలో పతకం కైవసం చేసుకుందని తెలిపారు. విద్యార్థినిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు అభినందించారు.

'గ్రాంట్ ఇన్ ఎయిడ్'కు 15లోపు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: గిరిజన సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందించే గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందేందుకు ఈనెల 15వ తేదీలోగా స్థానిక రెడ్డినగర్‌లోని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో మూడుసెట్ల దరఖాస్తులు అందజేయాలని ఆ శాఖ జిల్లా అధికారి జ్యోత్స్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాన్-గురుకుల, గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు, పది లేదా అంతకుమించి పడకల గల ఆసుపత్రులు, వైద్య చికిత్సాలయాలు, వ్యవసాయం, మృత్స్య, పాడి పరిశ్రమ, పశు సంవర్ధక రంగాల్లో మౌలిక సదుపాయాల మద్దతు, సామర్థ్య నిర్వాహణ ద్వారా జీవనోపాధి, ఆదాయ ఉత్పత్తి అవకాశాలు మెరుగుపర్చటం లాంటి అంశాలను నిర్వహిస్తున్న ఎన్‌జీఓ, వలంటరీ ఆర్గనైజేషన్, గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పర్యవేక్షకులు పి.చంద్రారావును సంప్రదించాలని కోరారు.

గుండ్లకమ్మలో మహిళ మృతదేహం లభ్యం

నూజెండ్ల(శావల్యాపురం): గేదెలు తోలుకుంటూ గుండ్లకమ్మ వాగులో దిగి ప్రమాదవశాత్తు మహిళ గల్లంతైన ఘటనలో మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్ఐ ఎంవీ కృష్ణారావు తెలిపారు. నూజెండ్ల మండలం పాత నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బిజినేపల్లి మరియమ్మ (45) గేదెలు తోలుకొంటూ వెళ్లి సమీపంలోని గుండ్లకమ్మ వాగులో పడి మృతిచెందింది. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఠాధిపతి బాధ్యతల స్వీకరణకు తరలిరండి

తెనాలి: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జన్మస్థలమైన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా తెనాలి వాసి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) బాధ్యతలు స్వీకరించనున్నట్లు శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో జరగబోయే ఈ మహోత్సవానికి తెనాలి, పరిసరాల్లోని భక్తులు తరలి రావాలని ఆయన కోరారు.